క్లుప్తంగా

16న నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 16వ తేదీ(ఆదివారం)న సాయంత్రం నెలనెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాత్తుల రవీంద్రనాథ్, కళా సాంస్కృతిక సంస్థ (ఆర్ట్స్) అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్‌కుమార్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు కళాకారులచే 'అతీతం'అనే నాటిక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామేపల్లి(కారేపల్లి): టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అమెరికాలో రైతులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ఈమేరకు కామేపల్లి రైతు వేదిక వద్ద బీఆర్‌ఎస్ రైతు సమితి మండల కన్వీనర్ అంతోటి అచ్చయ్య ఆధ్వర్యాన రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.రైతుల సాగుకు 24 గంటల కరెంట్ అవసరం లేదని, 3 గంటల కరెంట్ సరిపోతుందని చెప్పడం హేయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కన్నమాల రాంబాబు, తాటిపల్లి నరసింహారావు, అజ్మీర బస్సిలాల్, ఏనుటి రామనర్సయ్య, జల్లి రాములు, మేదర శ్రీనివా స్, బత్తుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



సీపీకి మొక్కను అందజేస్తున్న సీఐ

ఖమ్మంక్రైం: ఇటీవల జరిగిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బదిలీలలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పీసీఆర్ నుంచి ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన రవికుమార్ మంగళవారం టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

మాజీ మంత్రి తనయుడి పరామర్శ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, బీఆర్‌ఎస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని గువ్వలగూడెంలో మృతి చెందిన గోగినేని వీరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. నేలకొండపల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గణేష్ కుటుంబాన్ని,సింగారెడ్డిపాలెంలో అనారోగ్యానికి గురైన నరేష్ మాతృమూర్తిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మండల మాజీ అధ్యక్షుడు వెన్నపూసల సీతారాములు, నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, కొమ్మూరి నరేష్, కె.ప్రసాద్, గెల్లా జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నివాళి

తిరుమలాయపాలెం: ఆరెంపుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సుబ్లేడు గ్రామానికి చెందిన బట్టు రాజేష్ మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు నివాళులర్పించారు. సుదర్శన్‌రావు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నరాజేష్ ఖమ్మం వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. దీంతో సుబ్లేడులో రాజేష్ మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, పార్టీ రాష్ట్ర నాయకుడు కాసాని అయిలయ్య, కొత్తగూడెం పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నర్సయ్య, తుళ్లూరి నాగేశ్వరరావు, వీరన్న, బింగి రమేష్, శ్రీను, సత్తిబాబు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రాజేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

నగరంలో సినిమాలు

తిరుమల	రంగబలి
వినోద	మిషన్ ఇంపాసిబుల్ (ఇంగ్లిష్)
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	మిషన్ ఇంపాసిబుల్(తెలుగు)
శ్రీనివాస	భాగ్ సాలే
సుందర్	గ్యాంగ్ లీడర్, సర్కిల్

- ఖమ్మంగాంధీచౌక్




మంచినీటిలోనే డెంగీ దోమలు..

ప్రతీ ఏడాది వర్షాకాలంలో ప్రజలంతా అలెర్ట్‌గా ఉండాల్సిందే. లేకపోతే వ్యాధుల బారిన పడక తప్పదు. సీజనల్ వ్యాధుల్లో డెంగీ వ్యాధి చాలా ప్రమాదకరం. ఈ వ్యాధి రావడానికి ప్రధాన కారణం మంచినీటిలో పెరిగే దోమలే. ఇవి ఎక్కువగా రోడ్ల వెంట పడేసిన మూతలు, డబ్బాలు, ఇళ్లల్లోని పాత టైర్లు, కూలర్లు, కుండలు వంటి వాటిలో ఉన్న నిల్వ నీటిలో పెరుగుతాయి. కాబట్టి, ప్రజలు వారానికో రోజైనా ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గత ఏడాది 136 డెంగీ కేసులు నమోదవ్వగా.. ఈ ఏడాది మూడు కేసులు నమోదయ్యాయి. కేఎంసీ సూచనలు పాటిస్తూ డెంగీ నివారణలో భాగస్వాములు కావాలి. కేఎంసీ నిబంధనలు పాటించకపోతే పర్యావరణ నిబంధనలు, కేఎంసీ చట్టం ఉల్లంఘనల కింద జరిమానా విధిస్తాం.

– కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

బీ అలెర్ట్..



సీజనల్ వ్యాధులపై కేఎంసీ ముందస్తు కార్యాచరణ

- డెంగీ నివారణే లక్ష్యంగా ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే
- ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించేలా ప్రచారం
- గత ఏడాది 136, ప్రస్తుతం మూడు డెంగీ కేసులు నమోదు
- 'సాక్షి'తో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. దోమల కారణంగా డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నారు. జూలై నుంచి అక్టోబర్ వరకు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి నిల్వ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సీజనల్ వ్యాధుల నివారణకు కేఎంసీ తీసుకుంటున్న చర్యలను మంగళవారం కమిషనర్ ఆదర్శ్ సురభి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఇంటర్వ్యూ పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

ఖమ్మంమయూరిసెంటర్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కేసీఎం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. విషజ్వరమైన డెంగీ రావడానికి ప్రధాన కారణం మంచినీటిలో పెరిగే దోమలే అన్నారు. ఇవి ఎక్కువగా నీరు నిల్వ ఉండే పూలకుండీలు, కుండలు, గిన్నెలు, టైర్లు, కూలర్లు, రిఫ్రిజిరేటర్ల వెనుక ఉండే నీటి నిల్వ డబ్బాలు, రోడ్ల వెంట పడేసిన మూతలు, డబ్బాల్లో పెరుగుతాయని చెప్పారు. మురికిగుంతలు, డ్రెయినేజీల్లో ఉత్పత్తి కావన్నారు. ఇవి ఏడు రోజులు లార్వా రూపంలో ఉండి తర్వాత దోమగా రూపాంతరం చెందుతాయని పేర్కొన్నారు.

ప్రజలదే ప్రధానపాత్ర..

డెంగీకి కారణమైన దోమలు పెరగడానికి ప్రజల పాత్ర చాలా ఉంటుంది. అవి ఎక్కువగా మన పరిసరాల్లోనే పెరుగుతుండడంతో ఎవరి ఇంట్లో వారు పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో పాటు ఇంటి పరిసరప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. వారానికి ఒకరోజు తప్పకుండా పరిసర ప్రాంతాల్లో చెత్తచెదారం లేకుండా పొడి వాతావరణంలో ఉంచుకోవడం ద్వారా ఇతర దోమలను అరికట్టవచ్చు. ఈ విషయంలో ప్రజలదే ప్రధాన పాత్ర వహించాల్సి ఉంటుంది.

ప్రతిష్ఠాత్మకంగా డ్రైడే..

జూలై నుంచి అక్టోబర్ వరకు డెంగీ వంటి విషజ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తుండడంతో ఈ నాలుగు నెలలు వ్యవధిలో వ్యాధులు ఉధృతి కాకుండా ఉండేందుకు కేఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే వంటి కార్యక్రమాలను చేపట్టింది. ప్రతీ గురువారం ప్రభుత్వ కార్యాలయాల్లో డ్రైడేలో భాగంగా పరిసరాలను శుభ్రం చేయడం , ప్రతీ ఆదివారం నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలందరూ ఎవరి ఇంట్లో వారు నిల్వ నీటిని తొలగించడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చాం. వీటిపై ప్రజలకు, ప్రభుత్వ కార్యాయాల్లో ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాల ద్వారా డ్రైడే గురించి ప్రచారం చేయాలని నిర్ణయించాం.

దోమలు ప్రబలే ప్రాంతాలపై దృష్టి..

దోమల పెరుగుదల పారే మురుగునీటిలో కన్నా నిల్వ ఉన్న నీటిలో ఎక్కువగా ఉంటుంది. నగర పరిధిలోని పాత సామన్ల దుకాణాలు, మెకానిక్ షెడ్లలో ఉండే పాత సామన్లు, టైర్లలో నీరు చేరి దోమలు ఉత్పత్తి అవుతున్నాయనేది గుర్తించాం. వీరికి ప్రతి రోజు దుకాణాలను శుభ్రం చేసుకోవడంతో పాటు నిల్వ నీటిని పారబోయాలని సూచించాం. నగరంలోని అన్ని దుకాణాలకు నోటీసులను పంపిస్తాం. ఎక్కడైనా కేఎంసీ సూచనలు పాటించకపోతే పర్యావరణ నిబంధనలు, కేఎంసీ చట్టం ఉల్లంఘనల కింద జరిమానా విధిస్తాం.

గత ఏడాది 136 కేసులు..

గత ఏడాది ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 136 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వీటిలో 124 కేసులు జూలై, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లలో నమోదు అయినవే. ఈ ఏడాది ఇప్పటి వరకు మూడు కేసులు మాత్రమే గుర్తించాం. ఈ కేసుల సంఖ్య పెరగకుండా అవసరమైన చర్యలను తీసుకుంటున్నాం. స్వయంగా కార్పొరేషన్ పరిధిలో పర్యటించి నిల్వ నీరు ఉండకుండా చూస్తున్నాం. గత శుక్రవారం రాష్ట్ర రవాణశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేత కేఎంసీలో డ్రైడే కార్యక్రమాన్ని ప్రారంభించాం. డ్రెయినేజీల్లో, మురుగునీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్‌బాల్స్‌ను వేయడం ప్రారంభించాం. పారిశుద్ధ్య విభాగం ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా చేపడుతోంది.

ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలి



రూరల్ డీఈకి వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(టీఎస్‌యూఈఈయూ) ఆధ్వర్యాన మంగళవారం నగరంలోని డివిజనల్ ఇంజనీర్ల కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని ప్రధాన డిమాండ్‌తో ఆందోళన నిర్వహించారు. ఖమ్మం టౌన్ డీఈ, ఖమ్మం రూరల్ డీఈ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాక ఆయా డివిజన్ల అధికారులకు వినతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్, జిల్లా కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, కంపెనీ ఉపాధ్యక్షుడు సీహెచ్.ముకుందరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు లాలయ్య, డివిజన్ కార్యదర్శి సీతయ్య, నాయకులు గోపిరెడ్డి, కమలాకర్, కృష్ణమూర్తి, రామయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన కల



శ్మశానవాటికలో వేసిన బోరు వద్ద గ్రామస్తులు

రఘునాథపాలెం: మండలంలోని కామంచికల్ గ్రామపంచాయతీకి చెందిన పాటివారిగూడెం గ్రామంలో ఎన్నో ఏళ్లగా ప్రధాన సమస్యగా ఉన్న శ్మశానవాటికకు రహదారి, బోరు ఏర్పాటు కల మంగళవారం నెరవేరింది. గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు గ్రామ సర్పంచ్ మెదరమెట్ల వెంకటరమణ ఆధ్వర్యాన శ్మశానవాటిక వద్ద ఉన్న పురాతన బావిని పూడ్చింపి, దారివేయించడంతో పాటు గ్రామస్తుల సౌకర్యార్థం బోరు కూడా వేయించారు. ఈమేరకు గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభాకర్, వార్డు మెంబర్ కృష్ణ, దాసరి వెంకటనారాయణ, కోటయ్య, నాగయ్య, వెంకటలక్ష్మి, వెంకటరత్నం, రాము,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

రఘునాథపాలెం: ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఇతర పోస్టులను భర్తీ చేయాలని బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేష్ కోరారు. మంగళవారం చిమ్మపుడి గ్రామంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా.. నేటికి పాఠ్యపుస్తకాలు అందలేదని, మూత్రశాలలు సరిగా లేవని, టీచర్ల సమస్యతో కొన్ని స్కూళ్లు ఇబ్బంది పడుతుంటే, విద్యార్థులు లేక మరికొన్ని పాఠశాలలు మూసివేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఈ బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షుడు జోనెబోయిన నవీన్, నాయకులు దొంతు గణేష్, జోనెబోయిన సందీప్, నవీన్, అజయ్, సాయి, సురేష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన జీపీ కార్మికుల సమ్మె



తిరుమలాయపాలెం: కార్మికుల దీక్షలకు మద్దతు ప్రకటిస్తున్న ప్రజాపంథా నాయకులు

సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు పలు పార్టీలు, సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించి జీపీ కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.19వేలు చెల్లించాలని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

మెమోలు తీసుకెళ్లండి

ఖమ్మం సహకారనగర్: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన టెక్నికల్ కోర్సు పరీక్షలైన డ్రాయింగ్, టైలరింగ్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల పాస్ మెమోలు తమ కార్యాలయాలనికి వచ్చాయని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాల్ టిక్కెట్, ఆధార్‌కార్డును తీసుకొచ్చి మెమోలు తీసుకెళ్లాలని సూచించారు.

'రెజొనెన్స్ శ్రీనివాసనగర్'లో హరితహారం



చిన్నారితో మొక్క నాటుతున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని శ్రీనివాసనగర్‌లో గల రెజొనెన్స్ స్కూల్‌లో మంగళవారం హరితహారం కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా | అభివృద్ధి పనులు



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో ఎస్‌డీఎఫ్, సుడా నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. నగరాభివృద్ధిలో భాగంగా సుడా నిధులు రూ.1 కోటి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3.20 కోట్లు మొత్తం రూ.5.20 కోట్లు మంజూరవ్వగా.. 14వ డివిజన్ మధురనగర్–గొల్లగూడెంలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేసి, సుడా నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. అలాగే 20వ డివిజన్ కృష్ణనగర్‌లో సుడా నిధులతో సీసీ నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించనున్న డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు. 21వ డివిజన్ పార్శిబంధంలో సుడా నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించి, ఎస్‌డీఎఫ్ నిధులతో అబ్దుల్‌కలాంనగర్‌లో నిర్మించనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా 40, 33వ డివిజన్‌లలో సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. ప్రజావసరాలను అనుగుణంగా రూ.కోట్లు వెచ్చించి నగరాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ.50 కోట్లతో కేఎంసీ పరిధిలో 32 కిలోమీటర్ల మేర సీసీ కాల్వలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్‌సురభి, కార్పొరేటర్లు కూరాకుల వలరాజ్, ప్రశాంతలక్ష్మి, ఆళ్ల నిరీషారెడ్డి, తోట ఉమారాణి, మడురి ప్రసాద్, మున్సిపల్ ఏంఈ కృష్ణలాల్, డీఈ ధరణి, నవ్య జ్యోతి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



ఎల్‌ఎల్‌ఆర్ ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి

ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలంటే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడమే కాక రహదారి నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన యువతకు ఎల్‌ఎల్‌ఆర్ ధ్రువ పత్రాలను మంత్రి మంగళవారం అందజేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు తీసుకునేలా మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీటీఓ కిషన్‌రావు, జిల్లా ఆర్‌టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, ఎంవీఐ వరప్రసాద్, నాయకులు గుండాల కృష్ణ, మేకల సుగుణరావు, తన్నీరు శోభారాణి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు వ్యసనాల బారిన పడొద్దు..



వైద్య పరీక్షలను ప్రారంభిస్తున్న డీఎం శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీ ఉద్యోగులు గుట్కా, మద్యపానం వంటి వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆర్టీసీ ఖమ్మం డీఎం శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఖమ్మం డిపోలో ఏర్పాటు చేసిన హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని ప్రారంభించాక ఆయన మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ యొక్క విధులు సక్రమంగా చేసుకునే అవకాశం ఉంటుందని, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో సీఐ రామయ్య, ఎంఎఫ్ లక్ష్మీనారాయణ, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ట్రాలీ వర్కర్ పుట్టబంతి పుల్లయ్య(48) కుటుంబానికి మార్కెట్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీఆర్‌ఎస్‌కేవీ ఖమ్మం నగర అధ్యక్షుడు నున్నా మాధవరావు నేతృత్వంలో సంఘం నాయకులు సాదె శంకర్, ఆవుల శ్రీనివాసరావు, ఎస్.వెంకటప్పయ్య, ఎర్ర రాంరెడ్డి, కొత్త సైదిరెడ్డి, జంగం లక్ష్మయ్య, ఎస్‌కె.షరీఫ్, రామకృష్ణలు నగరంలోని అగ్రహారం కాలనీలో నివాసం ఉంటున్న మృతుడి భార్య పద్మకు అందజేశారు. అనంతరం పుల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

బాలకార్మికులతో పనులు చేయిస్తే కేసు

నేలకొండపల్లి: బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆపరేషన్ స్మైల్ ఖమ్మం రూరల్ డివిజన్ అధికారి, ఖమ్మం రూరల్ ఎస్సై రవూఫ్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి బాల కార్మికులతో పని చేయిస్తున్న ఇద్దరు దుకాణ యాజమానులపై కేసు నమోదు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ దుకాణం వద్ద బాల కార్మికులు లేరనే బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు, మెకానిక్ షోరూమ్‌లలో బాల కార్మికులు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీమ్ సభ్యులు వెంగమాంబ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ మంగీలాల్

తిరుమలాయపాలెం: మన ఊరు–మన బడి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మండల ఎంపీపీ మంగీలాల్ అన్నారు. మంగళవారం మండలంలోని జల్లెపల్లి పాఠశాలలో మనఊరు–మనబడి కార్యక్రమాలను పరిశీలించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కృషితో పాఠశాల అభివృద్ధికి రూ.60లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, రవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే పండుగ 'సీత్లా'

బోనమెత్తిన తండాలు..

గిరిజనుల ఆరాధ్యదైవమైన సీత్లా భవానీ పండుగ (దాటుడు పండుగ)ను మంగళవారం మండలాల్లోని పలు తాండాల్లో ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, వర్షాలు బాగా కురవాలని కాంక్షిస్తూ బంజారాలు డప్పు నృత్యాల నడుమ బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా సీత్లా అమ్మవారి వద్దకు చేరుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు తమ పశువులకు రంగులు చల్లి వాటికి పూజలు చేశారు. కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో తండాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న 44వ డివిజన్ లెనిన్‌నగర్ బంజారాలు



కూసుమంచి: లింగారంతండాలో ఊరేగింపుగా వస్తున్న గిరిజనులు



నేలకొండపల్లి: మంగాపురంతండాలో..



రఘునాథపాలెం: చింతగుర్తి గ్రామంలో..